

నమాజ్ చేస్తున్న చిన్నారి



ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న మేయర్ సునీల్‌రావు



ముస్లింలతో కాంగ్రెస్ నాయకుడు రోహిత్‌రావు అలాయ్ బలాయ్

ఈద్ ముబారక్

కరీంనగర్‌తో పాటు కరీంనగర్‌రూరల్, కొత్తపల్లి మండలాల్లో శనివారం రంజాన్ పండుగను ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయాన్నే కొత్తబట్టలు ధరించి మసీదులు, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దల సందేశాన్ని విని ఒకరికొకరు ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. ఇళ్లల్లో బంధుమిత్రులకు విందులు ఏర్పాటు చేసి తమ మైత్రీ భావాన్ని చాటుకున్నారు. భగత్‌నగర్‌లోని మేయర్ క్యాంపు కార్యాలయంలో ముస్లింలకు మేయర్ సునీల్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. సాలెహనగర్‌లో కాంగ్రెస్ నాయకులు కోమటిరెడ్డి, నరేందర్‌రెడ్డి, మెన్నేని రోహిత్‌రావు, మైత్రి గ్రూఫ్ ఆఫ్ చైర్మన్ కొత్తజయపాల్‌రెడ్డి పాల్గొన్నారు. నగునూరులోని ఈద్గాలో సర్పంచ్ ఉప్పుల శ్రీధర్, ఉప సర్పంచ్ దామోదర్‌రెడ్డి, ఎంపీటీసీ వినయ్‌సాగర్, శ్రీనివాస్, సింగిల్‌విండో డైరెక్టర్ మహేందర్, రూరల్ సీఐ విజ్ఞాన్‌రావు, ఎస్సై అశోక్ తదితరులు ముస్లింలకు ఈద్‌ముబారక్ శుభాకాంక్షలు తెలిపారు. – కరీంనగర్‌కల్చరల్/కరీంనగర్‌రూరల్/కొత్తపల్లి



నగునూరులో నమాజ్ చేస్తున్న ముస్లింలు

వైభవంగా శివపార్వతుల కల్యాణం



నగరంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో గల శ్రీఉమా మహేశ్వర స్వామి ఆలయంలో 14వ వార్షికోత్సవం పురస్కరించుకొని శనివారం శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఆకుల పద్మ ప్రకాశ్, సామ వేణు, గర్రెపల్లి సత్యనారాయణరావు, చారి, రాజిరెడ్డి, నారదాసు వసంత్‌రావు, నర్సింగ్, జాజాల మోహన్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. - కరీంనగర్‌కల్చరల్

క్లుప్తంగా

ఎల్లమ్మతల్లి బోనాలకు ఆహ్వానం



మేయర్‌కు ఆహ్వానపత్రం అందజేస్తున్న గౌడ కులస్తులు, నాయకులు

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్ గౌడ కులస్తుల ఆధ్వర్యంలో ఈనెల 25న నిర్వహిస్తున్న ఎల్లమ్మతల్లి బోనాలకు హాజరు కావాలని కోరుతూ గౌడ సంఘం నాయకులు, కులస్తులు శనివారం మేయర్ సునీల్‌రావును ఆయన నివాసంలో కలిసి ఆహ్వానపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోడూరి సత్యనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సయ్యద్ ఇర్ఫాన్‌ను కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు



విద్యానగర్(కరీంనగర్): రంజాన్ పండుగా సందర్భంగా శనివారం కరీంనగర్‌లోని రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు సయ్యద్ ఇర్ఫాన్ శనివారం బీఆర్‌ఎస్ నాయకులు కలిశారు. మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణ, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ పొన్నం అనిల్, మార్కెట్ కమిటీ చైర్మన్ మధు, వైస్ చైర్మన్ ఉప్పు రాజశేఖర్, కార్పొరేటర్లు కోల సంపత్, నాంపల్లి శ్రీనివాస్ తదితరులు కలిసి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తేనీటి విందులో పాల్గొన్నారు.

గోశాలకు తెలక పిండి వితరణ



కరీంనగర్‌టౌన్: కరీంనగర్ బైపాస్ రోడ్డులోని కామాదేనువు గోశాల జ్ఞాన కేంద్రాన్ని శ్రీరాజ రాజేశ్వరి లయన్స్ క్లబ్ సభ్యులు శనివారం సందర్శించి 50 కిలోల తెలక పిండిని వితరణ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఊకంటి సంపతి కుమారి, రాళ్లబండి శశికళ, శంకర్ ప్రసాద్‌రెడ్డి, నరహరి లక్ష్మారెడ్డి, సరళ, గోశాల నిర్వహణ బాధ్యులు రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

హన్‌మాన్ అర్ధమండల దీక్ష మాలధారణ

జమ్మికుంట: మున్సిపల్ పరిధి మారుతినగర్‌లోని శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో ఆలయ ప్రధాన అర్చకులు సముద్రాల ప్రసాదచార్యులు శనివారం హన్‌మాన్ అర్థ మండల దీక్ష మాలధారణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు పొనగంటి మల్లయ్య మాట్లాడుతూ...మాలధారణతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని, చెడు వ్యసనాలు దూరమౌతాయని తెలిపారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన 350 మంది భక్తులకు అర్ధ మండల దీక్ష మాలధారణ చేశారు. ఆంజనేయస్వామి దేవాలయం శ్రీరామ నామస్మరణతో మారుమోగింది. ఆలయ కమిటీ సభ్యులు, మాలధారణ స్వాములు పాల్గొన్నారు.

చిగురుమామిడిలో..

చిగురుమామిడి: చిగురుమామిడి శివారులోని పొంబండ శ్రీ పంచముఖాంజనేయస్వామి ఆలయం హన్‌మాన్ భక్తులతో కిటకిటలాడింది. శనివారం చాలా మంది భక్తులు మాలధారణ స్వీకరించారు. ఈసందర్భంగా భక్తుల శ్రీరామ నామస్మరణతో ఆలయం ప్రాంగణం మారుమోగింది.

బ్యాండ్.. బాజా.. బరాత్

- పెళ్లిళ్లలో పెరిగిన డ్యాన్స్ కల్చర్
- సకుటుంబ సపరివార సమేతంగా నృత్యాలు
- మెహందీ.. హల్దీ.. బరాత్‌లో ప్రత్యేక ఆకర్షణ
- ఇందుకోసం ప్రత్యేక శిక్షణ
- ఆసక్తి చూపుతున్న కుటుంబాలు

సండే స్పెషల్



పెళ్లి వేడుకల్లో సకుటుంబ సమేతంగా డ్యాన్స్

విద్యానగర్(కరీంనగర్): నీ బుల్లెట్టు బండెక్కి వచ్చేత్తపా.. అని ఒక పెళ్లి కూతురు, చమ్కీలా అంగిలేసి ఓ వదినే.. అంటూ మరో పెళ్లి కూతురు డ్యాన్సులతో పెళ్లి వేడుకల్లో అదరగొడుతున్నారు. నిన్నటి వరకు స్కూల్, కాలేజీ వేడుకల్లో విద్యార్థులు తమ నృత్యాలతో అదరగొట్టగా ఇప్పుడు పెళ్లి వేడుకల్లో డ్యాన్స్ కూడా భాగమైంది. సంగీత్, మెహందీ, బరాత్, రిసెప్షన్ పార్టీల్లో పెయిడ్ ఆర్టిస్టలతో పాటు సకుటుంబ పరివారంగా నృత్యాలతో సందడి చేస్తున్నారు. డ్యాన్స్‌పై క్రేజీ పెరగడంతో నృత్య శిక్షణాలయాలకూ డిమాండ్ పెరిగింది. రానున్న ముహూర్తాల్లో కాబోయే పెళ్లి కూతుర్లు తమ పెళ్లిలో డ్యాన్స్ చేయడానికి కోచింగ్ సెంటర్లలో చేరి బహుళ ప్రజాదరణ పొందిన పాటలపై స్టెప్స్ నేర్చుకుంటున్నారు. పెళ్లి వేడుకల్లోనే కాకుండా సందర్భోచిత సంబరాలు, వివిధ టీవీ చానళ్లు నిర్వహిస్తున్న డ్యాన్స్ ప్రోగ్రాము, స్కూళ్లు కాలేజీల్లో జరిగే కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. అంతేకాకుండా దాండియా, రాజస్తానీ, జానపద నృత్యాలపై క్రేజీ పెరుగుతుండటంతో కరీంనగర్‌లోని పలు డ్యాన్స్ అకాడమీలు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ యువత అభీష్టం మేరకు నృత్యాలు నేర్పిస్తున్నాయి.



సంగీత్ వేడుకల్లో నృత్యం చేస్తున్న పెళ్లి కూతురు



డ్యాన్స్ నేర్చుకుంటున్న యువతులు

డ్యాన్స్‌పై క్రేజీ పెరిగింది



20–25 ఏళ్ల క్రితం డ్యాన్స్ అంటే నామోషీగా భావించే వారు. టీవీ చానెళ్లలో ప్రత్యేక కార్యక్రమాలు, పోటీలు నిర్వహించడంతో డ్యాన్స్‌పై క్రేజీ పెరిగింది. ఇప్పుడు పెళ్లి కూతుర్లు తమ పెళ్లి వేడుకల్లో నృత్యాలు చేస్తూ వేడుకలకే ప్రత్యేకతను తీసుకొస్తున్నారు. కాబోయే పెళ్లి కూతుర్లు డ్యాన్స్ స్కూల్‌కు వచ్చి వారికి నచ్చిన పాటలపై నృత్యాలు నేర్చుకుంటున్నారు.

– శ్రీరామోజు రామకృష్ణ, డ్యాన్స్ మాస్టర్, బ్లూమెన్ డ్యాన్స్ అకాడమీ, రాంనగర్, కరీంనగర్

ప్రత్యేకత ఉండాలి



అందరిలో మనకు ఒక గుర్తింపు ఉండాలంటే మనలో ఏదో ఒక ప్రత్యేకత ఉండాలి కదా. పెళ్లిళ్లలో నృత్యాలు చేయాలని ఉంది. అందుకే అందుకే డాన్స్ నేర్చుకుంటున్న.

– గుంటుక చందన, విద్యార్థి, రాంచంద్రపూర్‌కాలనీ, కరీంనగర్

యువతులే ఎక్కువగా..



డాన్స్ అంటే సిగ్గుపడే యువతులు వారే ఇప్పుడు ప్రత్యేకంగా నృత్యాలు నేర్చుకుంటున్నారు. కాలేజీ వేడుకలు, పండుగలు, పబ్బాల్లో నృత్యాలు చేయడం, కాలనీలు, అపార్ట్‌మెంట్లలో జరిగే వేడుకల్లో యువతులే ముందుంటూ డ్యాన్సులు చేస్తున్నారు. యువతుల కోసం ప్రత్యేక బ్యాచ్ నిర్వహిస్తూ శిక్షణ ఇస్తున్న.

– దర్శనాల సరళ, రెయిన్ స్టార్ డ్యాన్స్ ఫ్లోర్, మంకమ్మతోట, కరీంనగర్

డ్యాన్స్ కామన్ అయింది



ప్రతీ వేడుకలో డ్యాన్స్ అన్నది కామన్ అయింది. పెళ్లిళ్ల, సంగీత్, మెహందీ, బరత్‌ల్లో పెళ్లి కూతురుతోపాటు కుటుంబ సభ్యులు కూడా డ్యాన్స్ చేస్తున్నారు. వీరితో పాటు అందమైన పెయిడ్ ఆర్టిస్టలతో డ్యాన్సలు, వెలకమ్ డ్యాన్సలు అ ఫంక్షన్‌కే ప్రత్యేకతను తీసుకొస్తున్నాయి.

– గోగుల ప్రసాద్, ఈవెంట్ ఆర్గనైజర్, కరీంనగర్

పెళ్లి జీవితంలో ముఖ్యఘట్టం



పెళ్లి అందరి జీవితంలో ప్రత్యేకమైన ముఖ్య ఘట్టం. జీవితాంతం ఆ జ్ఞాపకాలు ఉంటాయి. సాదాసీదాగా చేసుకుంటే చెప్పుకోవడానికి, జ్ఞాపకం చేసుకోవడానికి, ఇతరులు, మనుమలు, మనుమరాళ్లతో అ అనుభూతులు పంచుకోవడానికి ఏమి ఉంటుంది. అందుకే పెళ్లి వేడుక కొత్తగా ఉండాలి.

– తాళ్లం రవళి, కొత్త పెళ్లి కూతురు, భగత్‌నగర్, కరీంనగర్

పవర్‌కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: కరీంనగర్‌లో 33కేవీ వాటర్‌గ్రిడ్ నిర్వహణ పనులు, విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 33/11కేవీ భగత్‌నగర్, ఉజ్వల పార్కు సబ్‌స్టేషన్ల పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2 ఏడీఈ ఎం.సుధీర్‌కుమార్ తెలిపారు. అదే విధంగా 33కేవీ వాటర్‌గ్రిడ్ విద్యుత్ గ్రిడ్ విద్యుత్ లైన్ల పనులు చేపడుతున్నందున ఉదయం 8 గంటల నుంచి 10.30 గంటల వరకు 11కేవీ ఎల్లమ్మ ఫీడర్ పరిధిలోని ఆటోనగర్, పోచమ్మవాడ, ఎల్లమ్మ ఆలయం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–1 ఏడీఈ ఎస్.నరేందర్ తెలిపారు.

ధరిత్రీ దినోత్సవ అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న సంస్థల బాధ్యులు

కరీంనగర్‌కల్చరల్: ప్రపంచ ధరిత్రీ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం వికాస తరంగిణి, జెట్ ఆధ్వర్యంలో నగరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మార్కెట్ రోడ్ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ప్రారంభమైన ర్యాలీ ప్రకాశం గంజ్, టవర్‌సర్కిల్, రాజీవ్ చౌక్ మీదుగా తిరిగి వేంకటేశ్వరాలయం చేరుకుంది. కార్యక్రమంలో ఆయా సంస్థల బాధ్యులు,, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ధర్మమార్గం మోక్షానికి దారి



పూజలు నిర్వహిస్తున్న మహేశ్వరశర్మ

విద్యానగర్(కరీంనగర్): ధర్మమార్గం మోక్షానికి దారి చూపిస్తుందని శ్రీదుర్గాభవానీ ఆలయ ధర్మాధికారి, వేదపండితులు పురాణం మహేశ్వర శర్మ అన్నారు. కరీంనగర్ మండలం నగునూర్‌లోని శ్రీదుర్గాభవానీ ఆలయ వార్షికోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. గణపతిపూజ, పుణ్యాహవాచనం, శతచండీ, సంకల్పం, గణేశ సహస్ర మోదకం, భాస్యపారాయణారంభం, సప్తశతీపారాయణాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన అధ్యాత్మిక ప్రసంగం చేస్తూ ఆధ్మాత్మిక జీవనంలో సాగేందుకు మనసాక్కటే ఉపకరణమన్నారు. ప్రతీ సాధకుడూ ముక్తి కోసం ప్రయత్నించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ప్రధానార్చకుడు పవనకృష్ణ శర్మ, పండితులు, ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగళ లక్ష్మణ్, భక్తులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

గన్నేరువరం: క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని యువజన సంఘాల అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని జంగపల్లి గ్రామంలో నెల రోజులుగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ శనివారంతో ముగిసింది. ఫైనల్‌లో జంగపల్లి లెవన్, తిమ్మాపూర్ మండలం అల్గునూర్ లెవెన్ తలపడగా అల్గునూర్ జట్టు గెలుపొందింది. విన్నర్ జట్టుకు మొదటి బహుమతిగా శ్రీనాథ్‌రెడ్డి రూ. 15 వేలతో పాటు ట్రోఫీని, రన్నర్ జట్టు బీజేపీ నాయకుడు అటికం రామచంద్రం రూ.8 వేలతో పాటు ట్రోఫీని అందజేశారు. యువత క్రీడలను సద్వినియోగం చేసుకుని జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించాలని కోరారు. క్రీడల్లో పాల్గొనే యువకులకు తనవంతు సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు తాడూరి వంశీకృష్ణారెడ్డి, రంజిత్‌రెడ్డి, రాకేశ్, మధుకిరణ్‌రెడ్డి, అంజి పటేల్, కర్ర సాయి, శ్రీధర్, సూరి, క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు 'కిట్ల స్వర నీరాజనం'

కరీంనగర్‌కల్చరల్: ప్రముఖ దర్శకుడు కె.విశ్వనాథ్, సినీ గేయ రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి, సినీ నేపథ్య గాయని వాణీజయరాం స్మృతిలో కిట్ల స్వర నిరాజనం పేరుతో కరీంనగర్‌లోని ఫిలింభవన్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు కిట్ల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. సాహిత్య అభిమానులు హాజరు కావాలని కోరారు.

27నుంచి శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

వీణవంక: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు 27నుంచి మే 6వ తేదీ వరకు నిర్వహించనున్నామని ఆలయ అర్చకులు సతీశ్ శర్మ తెలిపారు. శనివారం ఆలయ ఆవరణలో బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరించారు. 27నుంచి 29వరకు అధ్యయనోత్సవాలు, మే 1న స్వామివారి కల్యాణ మహోత్సవం, 3న శతకలశాభిషేకం, 4న కుంకుమార్చన, 5న శకటోత్సవం, 6న రథోత్సవం, మొక్కులు చెల్లించుట, మహా అన్నదానం ఉంటుందని, బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

సర్పం కాదు మీనమే



పాములా ఉన్న చేప

కరీంనగర్ అర్బన్: ఈ చిత్రం చూసి పామనుకుంటే పడగాపై కాలేసినట్లే. పాములా ఉన్న ఈ చేప చూపరులను ఆశ్చర్యానికి గురి చేసింది. గౌతమినగర్‌కు చెందిన కొలిపాక వెంకటేశ్ గురువారం చేపల వేటకు వెళ్లగా వలకు చిక్కింది. తొలుత పామనుకుని భయపడిన వెంకటేశ్ తరువాత మలుగు పామని గుర్తించాడు. ఆరు కిలోలుండటం విశేషం.

నవ చండీయాగం



కరీంనగర్‌కల్చరల్: నగరంలోని రామేశ్వరాలయంలో శనివారం నవ చండీ యాగం వైభవంగా నిర్వహించారు. చండీహోమం అనంతరం మహాపూర్ణాహుతిని నిర్వహించి కలశోదక ప్రోక్షణ చేశారు. మహాదాశీర్వచనం, బుత్విక్ సన్మానం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలిపాక అంజయ్య, ఆలయ కమిటీ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

చిత్ర కథ



భవనమొకటే.. కార్యాలయాలు రెండూ!

భవనమొకటే కానీ రెండు కార్యాలయాలుండటం విమర్శలకు తావిస్తోంది. ఏదీ ఏ కార్యాలయమో తెలియక ప్రజలు తికమకపడుతున్నారు. మాతాశిశు ఆసుపత్రి పక్కన గల భవనంలో గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం, నీటి నాణ్యత ప్రయోగశాల కార్యాలయం ఉంది. భవనానికి బోర్డులున్నా లోపలికి వెళ్తే బోర్డులు లేకపోవడంతో అయోమయానికి గురవడం బాధితుల వంతవుతోంది. -కరీంనగర్‌అర్బన్